క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

దేవరకొండ : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు నీలా సంజీవ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపి కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం

డిండి : మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మండల కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం ఉంటుందని ఆ పార్టీ మండల కార్యదర్శి ఎస్.కనకాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ మహాసభల నిర్వాహణ, భవిష్యత్‌లో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

పెద్దవూర : టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 47 సంఘాలు బలపర్చిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి మలుపు అని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర సలహాదారు గజ్జెల జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట నాయకులు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

జైల్ భరో కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 9న భారత్ ముక్తి, రాష్ట్రీయ పిచాడవర్గ్, బహుజన్ కాంత్రి, రాష్ట్రీయ పరివర్తన్ మోర్చాల సంయుక్తంగా నిర్వహించే జైల్‌భరో కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బహుజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వజ్జగిరి అంజయ్య ఆవిష్కరించి మాట్లాడారు. బాంసెఫ్ జాతీయ అధ్యక్షులు వామన్ మేశ్రాంతో పాటు అనుబంధాల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జైల్ భరో కార్యక్రమంను విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున కార్యకర్తలను తరలించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోషన్, రామకృష్ణ, వెంకటయ్య, జయరాజు, సైదయ్య, సుధాకర్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దవూర : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆదివారం నల్లగొండకు చెందిన ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల ప్రజలకు ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, గుండె, కాలేయ, ఎముకలు, నరాల వ్యాధులకు సంబందించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 300మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా : అనుముల మండలంలోని నాయుడుపాలెం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శివకోటి వీర్రాజు తండ్రి శివకోటి జగ్గారావు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నాయుడుపాలెం గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్, నాయకులు వెంకటయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణ యాదవ్, రాంబాబు, రామలింగయ్య, వెంకటేశ్వర్లు, సైదులు ఉన్నారు.

ప్రాణాలు పోతున్నా..పట్టించుకోరా!

- మూడు రోజుల్లో రెండు ప్రమాదాలు.. ఇద్దరు మృతి
- ఫ్లై ఓవర్ల నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపనలు
- నెలలు గడిచినా.. నేటికీ పునాది పడని వైనం



ఫ్లై ఓవర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం ప్రజల ప్రాణాల మీదకు వస్తుంది. మూడు రోజుల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతిచెందారు. ఈ ప్రమాదాలకు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాల్సిన వారు తమకేమీ పట్టనట్లు వ్యవమరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత కొన్నేళ్ల క్రితం మిర్యాలగూడ పట్టణ శివారులో బైపాస్ నిర్మించి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా నిరోధించే విధంగా నార్కట్‌పల్లి – అద్దంకి బైపాస్ రోడ్డును నిర్మించారు. అయితే రోడ్డు నిర్మాణ సమయంలోనే రోడ్డు వెంట సర్వీస్‌రోడ్డు వేయాల్సి ఉన్నా. . ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పట్టణ సమీప గ్రామాల ప్రజలు బైపాస్‌రోడ్డు గుండానే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో పలు సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలకు గురై అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు.

పట్టణంలో ఐదు బ్లాక్‌స్పాట్లు..

నార్కెట్‌పల్లి– అద్దంకి బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత పట్టణం వాణిజ్య పరంగా పట్టణ విస్తీర్ణం పెరిగి బైపాస్ రోడ్డు కాస్త పట్టణం మధ్యలో ఉన్నట్లుగా అభివృద్ధి జరిగింది. దీంతో బైపాస్ రోడ్డుపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో జరుగుతున్న ప్రమాదాల తీవ్రతను బట్టి పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఐదు బ్లాక్‌స్పాట్లుగా గుర్తించిన పోలీసులు ఆయా ప్రదేశాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. అయినా ప్రమాదాలు ఆగకపోవడంతో ప్రమాదాల నివారణకు ఫ్లై ఓవర్ల నిర్మాణమే శరణ్యమని తలచిన పాలకులు పట్టణంలో నాలుగు ప్రాంతాలలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు.

తరచూ ప్రమాదాలు

ఈ నెల 21న మిర్యాలగూడ పట్టణంలోని శరణ్యగ్రీన్ హోమ్స్‌కు చెందిన పెట్నకోట భరతయ్య (75) తన తన హోండా యాక్టివా స్కూటీపై పట్టణంలోకి వస్తున్న క్రమంలో నందిపాడు బైపాస్‌రోడ్డు దాటుతుంగా గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. స్కూటీని ఢీ కొట్టిన అనంతరం అదే స్పీడ్‌తో రోడ్డుపై వెళ్తున్న ఆటోను ఢీ కొట్టి రోడ్డు ప్రక్కన నిలిపి ఉంచిన మరో రెండు డీసీఎం వాహనాలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పెట్నకోట భరతయ్య అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని చింతపల్లి బైపాస్‌రోడ్డు వద్ద వేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న మహిళ అక్కడిక్కడే మృతి చెందగా బస్సులో ప్రయాణిస్తున్న మరో పదిమందికి గాయాలయ్యాయి.

నాలుగు ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రూ .180 కోట్లు

పట్టణంలోని నార్కెట్‌పల్లి– అద్దంకి బైపాస్‌రోడ్డు గల వై జంక్షన్, నందిపాడు క్రాస్‌రోడ్డు, చింతపల్లి క్రాస్‌రోడ్డు, ఈదులగూడ క్రాస్‌రోడ్డు లలో ఫ్లై ఓవర్ల నిర్మాణం చేపట్టేందుకు రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకుని రూ. 180 కోట్ల విడుదల చేశారు. అందులో రూ.30 కోట్ల ఫ్లెఓవర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి భూ సేకరణ కోసం రూ.30 కోట్లు కేటాయించారు. ఆరు నెలల క్రితం ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా శంకుస్థాపనలు చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా.. నేటికీ పునాది పడకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఇంకా ఎంతమంది ప్రాణాలు పోవాలో.. అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులను ప్రారంభించి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

- వైభవంగా భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలో పాల్గొన్న మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

హాలియా : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని భక్తిభావం వైపు నడవాలని మాజీ సీఎల్పీనేత జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్వయంభూ శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ సీఎల్పీనేత జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, బీజేపీ నాయకులు మన్నెం రంజిత్ యాదవ్‌లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బహ్మశ్రీ నంది వెలుగు శ్రీబాలాజీ గురుకల్, త్రిశతాధిక ప్రతిష్ఠాచార్యుల రేపల్లె బృందం, సపతి ప్రసాద్ ఆధ్వర్యంలో పురోహితుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, మహాపూర్ణాహుతి, పుష్పయాగం, భక్తాంజనేయ స్వామి యంత్ర విగ్రహ స్థాపన, విమాన శిఖర స్థాపన తదితర పూజలను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో హాలియా పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ మోహన్ రావు, గౌరవ అధ్యక్షుడు నారాయణ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, లింగారెడ్డి, చంద్రారెడ్డి, వెంపటి శ్రీనివాస్, ఆలయ కమిటీ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి వెంకన్న, బాలకృష్ణ, గౌనీరాజా రమేష్ యాదవ్, రంగా శ్రీకర్, రాంమూర్తి, సోమనర్సయ్య, నరసింహ, రామ్ రహీం, శ్రీనివాస్, చిననారాయణ, భక్తులు తదితరులు ఉన్నారు.

ముగిసిన హజరత్ అబ్బాస్ దర్గా ఉర్సు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చింతపల్లి : మండల పరిధిలోని పీకే మల్లేపల్లి హజరత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉర్సు ఈనెల 21న ప్రారంభమై మూడు రోజులపాటు కొనసాగింది. ఆదివారం దర్గాను మాజీ మంత్రి పుష్పలీల దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉర్సును తిలకించేందుకు నల్లగొండ జిల్లానే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి వేల సంఖ్యలో భక్తులు హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతోపాటు దర్గాపై భాగంలో కొలువుదీరిన శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజులపాటు వైభవంగా మత సామరస్యానికి ప్రతికగా కొనసాగిన ఉర్సు ఘనంగా ముగిసింది. చివరి రోజు కందూర్లు, మొక్కులు తీర్చడంతో పాటు దర్గాలో అన్నదాన కార్యక్రమం కొనసాగింది.

ఆదర్శప్రాయుడు.. సంత్ సేవాలాల్ మహరాజ్



దేవరకొండ : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు



హాలియా : మాట్లాడుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, చిత్రంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి

దేవరకొండ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని ఆలిండియా బంజారా సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బంజారా భవన్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న సేవాలాల్ మహరాజ్ దేవాలయంలో గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన జాతిని జాగృతం చేసిన మహానుభావుడు సేవాలాల్ మహరాజ్ అన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డానియల్, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, బిక్కునాయక్, పాండునాయక్, బీల్యానాయక్, పాపానాయక్, లక్పతినాయక్, పాండునాయక్, చందర్‌నాయక్, గోపాల్‌సింగ్, శంకర్‌నాయక్, గోపాల్ సింగ్, నారాయణనాయక్, ధరంసింగ్, నాగేశ్వర్ నాయక్, సంఘం నాయకులు, తదితరులున్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

హాలియా : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ మార్గం అనుసరణీమని ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి అన్నారు. ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని చైతన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా హాజరై సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకులు బాబురావు నాయక్, బిక్షానాయక్, భగవాన్ నాయక్, సైకిలాబ్ నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు బాస్కర్‌నాయక్, రవినాయక్, సక్రు నాయక్, పాండునాయక్, నాయకులు పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నల్లగొండ టూటౌన్: యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి అన్నారు. ఎంజీ యూనివర్సిటీ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడోత్సవ్ బహుమతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మత్తు పదార్థాలు, సెల్‌ఫోన్లకు బానిస కాకుండా క్రీడా పోటీలు ఆడడం ద్వారా శారీరక దేహదారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఏబీవీపీ ఖేలో భారత్ క్రీడోత్సవ్ –2025 కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను క్రీడల్లో భాగస్వాములు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ ప్రాంత సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్, నల్లగొండ విభాగ్ ప్రముఖ్ కత్తుల మోహన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చత్రపతి చౌహన్, సుర్వి మణికంత, మానేశ్వర్ ఉన్నారు.

ఇంధన పొదుపుతో పర్యావరణ పరిరక్షణ



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

మిర్యాలగూడ : శిలాజ ఇంధన పొదుపుతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించొచ్చని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారి దిలీప్‌నాయక్ అన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం అందరు సైకిల్‌ను ఉపయోగించాలని, సొంత వాహనాలకు బదులుగా వీలైనంతవరకు ప్రజారవాణా సాధనాలను వినియోగించాలన్నారు. సైకిల్ ర్యాలీ పట్టణంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి సాగర్ రోడ్డు మీదుగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో గ్యాస్ డీలర్లు గుంటూరు రామారావు, సీహెచ్.మధు, గ్యాస్ డెలివరి బాయ్స్, సిబ్బంది ఉన్నారు.

మాజీ సర్పంచ్ బాలునాయక్‌కు కన్నీటి వీడ్కోలు



బాలునాయక్ అంతిమ యాత్రలో పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

అడవిదేవులపల్లి : మండలంలోని కొత్తనందికొండ గ్రామ మాజీ సర్పంచ్ రమావత్ బాలునాయక్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆదివారం బాలునాయక్ మృతదేహాన్ని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ సిద్ధార్థ, డీసీసీ అధ్యక్షులు కేతావత్ శంకర్‌నాయక్‌లు సందర్శించి నివాళులు అర్పించారు. అదే విధంగా మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి బాలునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలునాయక్‌ను కడసారిగా చూసేందుకు పెద్ద ఎత్తున గిరిజనులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం బాలునాయక్ అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే లమోతు భాస్కర్‌రావు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్ధార్థలు పాడే మోసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. బాలునాయక్ అంతిమ యాత్రలో మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మ, చిన రామయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమావత్ బాలునాయక్, సైకిలాబ్‌నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు బాలాజీనాయక్, శ్రీను, హనుమంతులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



పూజల్లో పాల్గొన్న జగదీష్‌రెడ్డి

దేవరకొండ : దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని రాష్ట్ర మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకొండ మండలం పద్మట్‌పల్లిలో శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి నూతన దేవాలయ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆయన వెంట మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టే మల్లికార్జునరెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, కేతావత్ బీల్యానాయక్, వెంకట్ నారాయణ, టీవీఎన్ రెడ్డి, వల్లపురెడ్డి, పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న అన్నభిమోజు నాగార్జునాచారి

మిర్యాలగూడ టౌన్ : విశ్వబ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గడగోజు చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేర్యాల వెంకటాచారి, సీనియర్ నేత అన్నభిమోజు నాగార్జునాచారి అన్నారు. ఆదివారం టాకా రోడ్డులోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణాలో విశ్వబ్రహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిపోయారన్నారు. సంఘం పటిష్టతతో పాటు సభ్యత్వం నమోదును కూడా ముమ్మరం చేయాలన్నారు. ఈ సమావేశంలో స్వర్ణకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యినుగుర్తి గోవర్ధనాచారి, మండలోజు సైదాచారి, మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సిరసనగండ్ల ఈశ్వరాచారి, కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లిఖారునచారి, నాయకులు కాతోజు వాసు, పి. సత్యనారాయణ, సోమాచారి, లక్ష్మణ్, దుర్గా ప్రసాద్, నాగాచారి, దేవులపల్లి శ్రీనివాసాచారి, నాగేంద్రచారి, ఎం. వెంకటాచారి, కోటయ్య, రమేష్, మట్టయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలి



దేవరకొండ : ఓటు అభ్యర్థిస్తున్న నర్సింహారెడ్డి

దేవరకొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నూకల నర్సింహారెడ్డి ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వస్కుల సుధాకర్, బెజవాడ శేఖర్, చెనమోని రాములు, వానం నరేందర్‌రెడ్డి, అంకూరి నర్సింహా, నేతాళ్ల వెంకటేష్, గుండాల అంజయ్య, జల్దా భాస్కర్, తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ, టీయూపీయూఎస్ ఉమ్మడి అభ్యర్థి పులి సరొత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నూకల నరసింహారెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సర్వోత్తం రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెనమోని రాములు, నరేందర్‌రెడ్డి, శివగౌడ్, అంజియాదవ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కొండమల్లేపల్లి : గురుకులంలో 5, 6 నుంచి 10వ తరగతికి సంబంధించి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 377మందికి గాను 368మంది విద్యార్థులు హాజరు కాగా 9మంది గైర్హాజరయ్యారు. అలాగే ఎస్సీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 714 మందికి గాను 699 మంది హాజరైనటు తెలిపారు.

వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ : పేద ప్రజల అవసరాల కోసం నూతనంగా నిర్మించిన వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో రూ.28లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వసతిగృహాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో పేద ప్రజలు చిన్నచిన్న శుభాకార్యాలు జరుపుకునేందుకు ఈ వసతిగృహం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీని నిర్మాణానికి తాను రూ.8లక్షల విరాళం అందించానని, ఇంకా మిగిలిన మొత్తాన్ని కూడా దాతల ద్వారా సేకరించి ఈ భవన నిర్మాణం పూర్తిచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టం చేయాలి

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం మూఢ నమ్మకాల వ్యతిరేక చట్టం తీసుకురావాలని జన వి/జ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు కునుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. ఈనెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకోని సైన్స్ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం సైన్స్ ఇచ్చిన ఒక విప్లవం అన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గంగాధరి భద్రయ్య, కళాశాల ఇన్‌చార్జి నాగకల్యాణి, కోటేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

సంత్ గాడ్గే బాబాకు నివాళి



మిర్యాలగూడ టౌన్ : బీసీ కళాశాల హాస్టల్‌లో నివాళులర్పిస్తున్న బీసీ నేతలు, విద్యార్థులు

దేవరకొండ : సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా జయంతిని ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చొల్లేటి భాస్కరాచారి, బాషానాయక్, కృష్ణాచారి, వరికుప్పల శ్రీను,పున్న వెంకటేష్, లక్ష్మణ్, గణేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో గాడ్గే మహరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్, సుధాకర్, మహేష్, గణేష్, నవాజ్, శివ, చింటూ,. వెంకటేష్, పవన్, రమేష్, నరేంద్రాచారి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న జనయేత్రి ఫౌండేషన్ చైర్మన్ మునీర్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బంగారుగడ్డ ఖైరలీ స్కూల్‌లో ఆదివారం పాఠశాలలో 2015 నుంచి 2021వరకు చదువుతుకున్న 7వ తరగతి ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనయేత్రీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్, న్యాయవాది హామీద్ షేక్, పాఠశాల కరస్పాండెంట్ అహ్మద్, ఆర్గనైజర్ బాబా షర్ఫోద్దీన్, ఉపాధ్యాయులు రహిమున్నీసా, బిపాష, సంధ్యాలతో పాటు పాఠశాల పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : పీఏపల్లి మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాల 2005–06 పదో తరగతి విద్యార్థులు ఆదివారం కొండమల్లేపల్లిలో సాగర్ రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. అనంతరం తమ పాఠశాల అనుభవాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వడ్డేపల్లి చంద్రారెడ్డి, తంగెళ్ల వెంకట్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.